

ఎంపీ ఈటల రాజేందర్‌కు సమస్యలను వివరిస్తున్న శ్రీవెంకటరమణకాలనీ వెస్ట్ సంక్షేమ సంఘం సభ్యులు

కాలనీల అభివృద్ధికి కృషి : ఎంపీ ఈటల

వనస్థలిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీవెంకటరమణకాలనీ వెస్ట్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా మర్యాదపూర్వకంగా శనివారం ఈటల రాజేందర్‌ను కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎంపీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి రాములునాయక్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి రాములు, కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కర్ణాకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నూతి శ్రీనివాస్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సిందూర్ ఎన్‌క్లేవ్ సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

మన్సూరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సిందూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ టవర్స్ వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్(సేవ) సభ్యుల విన్నపం మేరకు శనివారం ఆ ప్రాంతంలో ఆయన పర్యటించారు. తమ కాలనీకి రాకపోకలు సాగించడంలో ఇబ్బందిగా ఉన్న సర్వీసురోడ్డును వెడల్పు చేయాలని, వాహనాల పార్కింగ్‌తో హోటల్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, అపార్ట్‌మెంట్స్‌లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని, అన్ని బ్లాకులకు తాగునీరు వచ్చేలా చూడాలని, 60ఫీట్ల రోడ్డుకు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు తరలించాలని సేవ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సర్వీసురోడ్డు వెడల్పు, డ్రైనేజీ, తాగునీటి సమస్య విషయంలో పరిసర కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సేవ సభ్యులే నిర్ణయించి స్థలాన్ని చూపితే అక్కడకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సేవ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించడంతో పాటు పలువురు మహిళలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, పోచబోయిన జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనంతరాములు, జె.విజయసారధి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కేఎంరెడ్డి, సభ్యులు కె.పరమేశ్వర్, శివకుమార్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 4వ వార్డు శాంతినగర్‌కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి 52,517 రూపాయలను విరాళంగా అందజేశారు. శనివారం అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ప్రెసిడెంట్ మనియాద రమేష్ పోచమ్మ ఆలయ ప్రతినిధి అయిన వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు అమ్రేష్, పార్వతి, ఆకాష్, లింగమ్మ, సరస్వతి, నాగలక్ష్మి, వసంత, ఆంజనేయులు, సుమిత్రబాయి పాల్గొన్నారు.

కాలనీలో పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

సైదాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ కాలనీ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సైదాబాద్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు శనివారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, వెలగని వీధి దీపాలు, గుంతలమయంగా రోడ్లు వంటి పెండింగ్ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సత్వరమే పరిష్కరించే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, కార్యదర్శి శ్యాంసుందర్‌రావు, ఉపాధ్యక్షుడు ఆచార్యులు. కోశాధికారి సుబ్బలక్ష్మి, పర్వత్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం



తమ హక్కుల రక్షణకై నినదిస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఎల్బీనగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాలు ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బంజారాకాలనీలో శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గోపీనాయక్ విచ్చేసి మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు గిరిజన హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజన హక్కులకు సంబంధించిన చట్టాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని లంబాడీ గిరిజనులు ఈ వేడుకల్లో పాల్గొని హక్కుల రక్షణకు పాటుపడాలని సూచించారు. ఎన్టీఆర్‌నగర్ బంజారాకాలనీలోని లంబాడీ గిరిజనులకు సొంతిల్లులేక, ఇంటి అద్దెలు, నిత్యావసరాల భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ స్థలాల్లో అర్హులందరికీ 60 గజాల్లో డబుల్‌బెడ్రూమ్ ఇల్లు, రేషన్‌కార్డులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్‌నగర్ గిరిజన సంఘం నాయకులు కె.అవ్వజానాయక్, జె.మోహన్‌నాయక్, నందునాయక్, ఎస్.బాధ్యనాయక్, ఎన్.ఘమ్మదల్యానాయక్, ఎస్.రవినాయక్, జె.రవితేజనాయక్, కె.హిభినాయక్ పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ నిర్మాణం పూర్తి

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట రేస్‌కోర్సు వెళ్లే దారిలో పంచశీల లైబ్రరి ముందు మ్యాన్‌హోల్ నిర్మాణం పూర్తయింది. నాలుగు రోజుల క్రితం మ్యాన్‌హోల్ కుంగి నడిరోడ్డు మీద పెద్ద గుంత ఏర్పడింది. వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది కుంగిన మ్యాన్‌హోల్‌ను పూర్తిగా తొలగించి దాని స్థానంలో కొత్త మ్యాన్‌హోల్ నిర్మించారు. కుంగిన ప్రాంతంలో బారికేడ్లు పెట్టి అటువైపు వెళ్లే వాహనాల రాకపోకలు నియంత్రించి నిర్మాణం పూర్తిచేశారు. నిర్మాణం పూర్తికావడంతో శనివారం సాయంత్రం నుంచి టూవీలర్ వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. మ్యాన్‌హోల్ నిర్మాణం కోసం తవ్విన చోట రోడ్డు వేసిన తర్వాత అన్ని వాహనాల రాకపోకలు జరుగుతాయని వాటర్‌వర్క్స్ మలక్‌పేట సర్కిల్1 డీజీఎం హస్మత్‌అలీ తెలిపారు.

ఘనంగా క్రైస్తవ యువజన ప్రార్థన

చాదర్‌ఘాట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ది పెంతుకోస్తు మిషన్ చర్చిలో శనివారం క్రైస్తవ యువజన ప్రార్థన ఘనంగా జరిగింది. మలక్‌పేట, అంబర్‌పేట, ఎల్బీనగర్, ఉప్పల్, ముషిరాబాద్ నియోజకవర్గాలకు చెందిన అన్ని క్రిస్టియన్ డినామినేషన్ ఇండిపెండెంట్ చర్చిల క్రైస్తవ యువతీ, యువకులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. బైబిల్ వాక్య సందేశం, విశ్వాసజీవితంలో యువతీ, యువకులు ఎదుర్కొనే సమస్యలు ఆధ్యాత్మిక బోధనలతోపాటు పరిశుద్ధాత్మ అనుభవం, పరలోక రాజ్య సువార్త మర్మములు, ప్రకటన, దైవిక స్వస్థత అంశాలపై పలువురు ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రత్యేక సంగీతం, పాటలు, బైబిల్ నిర్వహణ కార్యక్రమం జరిగింది. 14ఏళ్ల వయసున్న బాలబాలికల నుంచి 30 సంవత్సరాల యువతీ, యువకులు హాజరైనట్లు ఇన్‌చార్జి శాంపాల్ తెలిపారు.

శానిటేషన్ సిబ్బంది సేవలు అభినందనీయం

చంపాపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నిత్యం కాలనీలు, బస్తీల పరిసరాలను శుభ్రం చేస్తున్న జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది సేవలు అభినందనీయం అని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని అనుపమానగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో శనివారం ప్రభుత్వపరంగా జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి కార్పొరేటర్ రక్షణ కిట్లను అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకం అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి



టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ కవిత, చిత్రంలో మంత్రి సీతక్క



రాష్ట్రపతి ముర్ముతో మలక్‌పేట అంధ పాఠశాల విద్యార్థులు

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ఎల్బీనగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలో రాఖీపౌర్ణమి పర్వదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు, యువతులు తమ తమ సోదరులకు రాఖీలను కట్టి మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టిన సోదరీమణులకు సోదరులు తమకు తోచిన విధంగా బహుమతులు, చీరలు అందించి వారి ఆశీర్వచనం పొందారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, నాయకురాళ్లు పాల్గొన్నారు.

మధుయాష్కీకి రాఖీ కట్టిన మంత్రి సీతక్క

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను మంత్రి సీతక్క శనివారం ఆయన నివాసంలో కలిసి రాఖీని కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, టీపీసీసీ నాయకురాలు సునీతారావు, ఇందిరాశోభన్, ఇతర కాంగ్రెస్ నాయకురాలు మధుయాష్కీని ఆయన నివాసంలో రాఖీని కట్టారు.

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో..

మన్సూరాబాద్ : రక్షాబంధన్ పర్వదిన వేడుకలు మన్సూరాబాద్‌లోని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి మహిళా మోర్చా నాయకురాళ్లు వారికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

పవిత్ర ప్రేమకు ప్రతీక రక్షాబంధన్: నర్సింహారెడ్డి

సోదరసోదరీమణుల పవిత్రమైన ప్రేమ, అనురాగం, ఆప్యాయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తోందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం తన నివాసంలోని తమ తోబుట్టువులతో పాటు డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు, బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు ఆయనకు రాఖీని కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : రక్షాబంధన్ వేడుకలను నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్క, చెల్లెలు అన్న, తమ్ముళ్లకు రాఖీల ను కట్టి తమ ప్రేమానురాగాలను చాటుకున్నారు. రాఖీలు కట్టిన అనంతరం అన్న, తమ్ముళ్లకు మిఠాయిలను తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ పౌర్ణమి వేడుకలతో పెద్ద కుటుంబంలో సందడి నెలకొంది. ఒకే చోటా రాఖీ వేడుకలను జరుపుకున్నారు. అనాజ్‌పూర్‌లో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డికి ఆయన సోదరీమణులు మమతారెడ్డి, రూపారెడ్డి రాఖీలు కట్టారు.

హయత్‌నగర్: హయత్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో నివాసం ఉండే అక్కచెల్లెలు పుట్టింటికి వచ్చి అన్నతమ్ముళ్లకు రాఖీలను కట్టారు. రాఖీ పండుగను పురస్కరించుకుని బస్‌స్టాప్‌ల వద్ద ప్రయాణికుల రద్దీ నెలకొంది. కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి, సోదరుడు జయవర్ధన్‌రెడ్డికి వారి సోదరి నవజ్యోతి రాఖీ కట్టారు.



బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న మహిళా మోర్చా నాయకురాళ్లు



హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి



మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరీమణులు



చంపాపేట డివిజన్ మాధవనగర్‌కాలనీలో అన్న తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న యువతి

సైదాబాద్: సోదరీమణులు, సోదరుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు శనివారం సైదాబాద్, మాదన్నపేట, కుర్మగూడ, అక్బర్‌బాగ్, ఐఎస్‌సదన్‌లలో ఘనంగా జరిగాయి. వయస్సు తారతమ్యం లేకుండా అందరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటా రాఖీ పండుగ సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు తమ పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

మన్సూరాబాద్ : రక్షాబంధన్ వేడుకలు నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు, యువతులు తమ తమ సోదరుల వద్దకు వెళ్లి రాఖీలను కట్టి మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీకట్టిన సోదరిమనులకు సోదరులు తమ తమకు తోచిన విధంగా బహుమతులు, చీరలు అందించి వారి ఆశీర్వచనం పొందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో..

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డికి పార్టీకి చెందిన మహిళలు, వివిధ కాలనీల మహిళలు రాఖీని కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఖీ కట్టిన మహిళలకు సామ రంగారెడ్డి చీరలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్: ఉప్పల

అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం తన నివాసంలో తన అక్కాచెల్లెలు సోమ నాగరాణి, కొసనగొట్టు మంజుల తదితర మహిళలు ఉప్పల శ్రీనివాస్‌గుప్తాకు రాఖీని కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపగా వారికి చీరలు, జ్ఞాపికలను బహుమతిగా అందజేశారు.

వ్యవసాయ మార్కెట్‌లో..

ఓల్డ్‌మలక్‌పేట: మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డికి మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ఉద్యోగులు పుష్ప, మాధురి పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అక్కలు, చెల్లెండ్లు తమ అన్నలు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. దీంతో స్వీట్‌షాపులు, రాఖీల విక్రయ కేంద్రాలు కిటకిటలాడాయి.

సరూర్‌నగర్ : రక్షాబంధన్ వేడుకలను మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలోని గ్రామాలు, కాలనీలు, బస్తీల్లో జరుపుకున్నారు. మహిళలు, యువతులు, బాలికలు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆత్మీయానుబంధాన్ని చాటుకున్నారు. మీర్‌పేట్‌లోని కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులంతా ఒక్కచోట చేరి పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన కంచర్ల కవిత

వనస్థలిపురం : రాఖీ పండుగను పురస్కరించుకుని కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ కంచర్ల కవిత మంత్రి సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి మిఠాయి తినిపించి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సీఎం పదవీ బాధ్యతలు చేపట్టాక మహిళల ఆత్మగౌరవం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం సంతోషకరం అన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో అంధ విద్యార్థులు

సైదాబాద్ : రాష్ట్రపతి భవన్‌లో శనివారం జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు రాష్ట్రపతి ముర్ము రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు హర్షిత, శశినందిత, కౌసల్ చందన, ప్రధానోపాధ్యాయురాలు అస్రా ఫాతిమా పాల్గొన్నారు. విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి యోగితా రాణా ప్రత్యేక చొరవ వేడుకలకు అవకాశం కలిగిందని హెచ్‌ఎం తెలిపారు.



బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి నివాసంలో వేడుకల్లో మహిళా మోర్చా నేతలు



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న సోదరి



చిలక నర్సింహారెడ్డికి రాఖీలు కడుతున్న మహిళా ఉద్యోగులు



బీజేపీ మీర్‌పేట్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఆలయాలకు ముఖ్యభాగం రాజగోపురం : ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆలయాలకు ముఖ్యమైన భాగం రాజగోపురం అని, ఇది భక్తులకు దైవత్వంతో అనుసంధానం అయ్యేందుకు మార్గదర్శకమని మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం పనులకు శనివారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి టీటీడీ వేద పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్న సబితారెడ్డిని శాలువాతో సన్మానించిన వేదపండితులు ఆమెకు ఆశీర్వచనం అందించారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహగౌడ్, నాయకులు గొడుగు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, నేలకొండ శ్రీనివాస్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, శంకర్‌నాయక్, రిషి, జగ్ని రమేష్, కాలనీసభ్యులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, పరుశురాం, సుధాకర్‌గుప్తా, మూర్తి పాల్గొన్నారు.



రాజగోపుర శంకుస్థాపనలో ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్‌లో పద్మశాలీలకు జంజనాలు పంపిణీ

సరూర్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సంఘం బడంగ్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం బడంగ్‌పేట్‌లో మార్కండేయుడి పూజలు ఘనంగా నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు గుడ్డేటి కిష్టయ్య, అధ్యక్షుడు పాలాది రాందాస్ హాజరై పద్మశాలీ యువకులకు జంజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీలు ఐకమత్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని అన్నారు. రాజకీయ పార్టీల మాయలో పడి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుకుడాల యాదగిరి, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి మకం కృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో కనులపండువగా శ్రావణ మాసోత్సవాలు

కొత్తపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆలయాల్లో కనుల పండువగా పవిత్ర శ్రావణ మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు తోడు రెండో శనివారం సెలవు రోజు కావడంతో కొత్తపేటలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ప్రధాన వేంకటేశ్వరాలయం, విజయ వినాయకస్వామి, విశాలాక్షీ అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయ స్వామి తదితర ఉపాలయాలను స్వామివార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. ప్రసన్నాంజనేయస్వామికి ఉదయం వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా సుదర్శనహోమం నిర్వహించారు. అదేవిధంగా ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలోని శ్రీరామ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, కొత్తపేట పురాతన భక్తాంజనయస్వామి ఆలయం, ఎస్‌బీహెచ్ కాలనీలో, సత్యానగర్ కాలనీల్లో గల ఆలయాల సముదాయం హరిహరక్షేత్రంలోనూ ప్రత్యేక పూజల్లో పరిసర కాలనీల భక్తులు పాల్గొన్నారు.



పద్మావతీగోదా సమేత వేంకటేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం

భక్తులను ఆకట్టుకున్న గజేంద్రమోక్షం హరికథ

చంపాపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం భాగవతార్ హరిదాసు యడవల్లి సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన గజేంద్రమోక్షం హరికథ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. రాఖీపండుగ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయంలో ధ్యానాంజనేయస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో హార్మోనియం యడవల్లి వేణుబాబు, తబలా కొండపల్లి నటరాజు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అష్టలక్ష్మీ ఆలయ పవిత్రోత్సవాలు

ఎల్‌బీనగర్ : అష్టలక్ష్మీ ఆలయ పవిత్రోత్సవాలు శనివారం ముగిసాయి. ఆలయంలో ఉత్సవమూర్తులకు 81 కలశములతో స్నపనం, యాగశాలలో చతుస్థానార్చన, నిత్యహవనములు, శ్రీసూక్త హవనం, పవిత్రోత్సవం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం, మహా పూర్ణాహుతి కనులపండువగా నిర్వహించారు. కుంభప్రోక్షణ, పవిత్ర అవరోహణ, మాత్రాదానం, గోష్ఠి, ఋత్విక్ సన్మానం, ఆశీర్వచనం, సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి సువర్ణ రథోత్సవమును వేదపండితులు వైభవంగా నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పైనుంచి పడి విద్యుత్ ఆర్టిజన్‌కు తీవ్రగాయాలు

చాదర్‌ఘాట్ : చంచల్‌గూడ సెక్షన్ పరిధిలోని మలక్‌పేట పల్టన్ బడా మజీద్ వద్ద శనివారం ఉదయం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్‌వేసి కిందకు దిగుతున్న సెక్షన్ ఎఫ్‌ఓసీ ఆర్టిజన్ గోవర్ధన్ ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయాన్ని గమనించి స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో చాదర్‌ఘాట్‌లోని కేర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గోవర్ధన్ తల కు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందన్నారు. విషయం తెలుసుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవర్ధన్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవడానికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆయన కేర్ ఆస్పత్రి వైద్యులకు విజ్ఞప్తి చేశారు. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, చంచల్‌గూడ ఏడీఈ శోభన్‌బాబు, సీబీడీ ఏడీఈ ఇమ్రాన్, ఏఈ లు సోహేల్, ప్రసాద్, ఇతేహాద్ యూనియన్ సభ్యులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జాతీయ రహదారి 65పై వాహనాల రద్దీ

- హయత్‌నగర్ నుంచి వనస్థలిపురం వరకు ట్రాఫిక్ జాం.. నెమ్మదిగా కదిలిన వాహనాలు

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగతో పాటు వరుస సెలవులు రావడంతో విజయవాడ జాతీయ రహదారి-65 వాహనాల రద్దీతో కిటకిటలాడింది. శుక్రవారం సాయంత్రం నుంచి జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. శనివారం రాఖీ పండుగ నేపథ్యంలో రోడ్డుపై మరింత ట్రాఫిక్ పెరిగింది. ముఖ్యంగా హయత్‌నగర్ బస్టాండ్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున బస్‌స్టాండ్ వద్దకు చేరుకోవడంతో ట్రాఫిక్ అంతరాయానికి కారణమైంది. అదేవిధంగా రాఖీలను కట్టేందుకు వెళ్లే వారు తమ సొంత వాహనాలను బయటకు తీయడంతో రోడ్డుపై వాహనాల సంఖ్య పెరిగింది. హయత్‌నగర్ బస్టాండ్ వద్ద వాహనాలు నమ్మదిగా ముందుకు కదులుతుండడంతో వనస్థలిపురం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లు కూడా వాహనాల రద్దీతో కనిపించాయి. దీంతో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. వనస్థలిపురం ట్రాఫిక్, హయత్‌నగర్ లాఅండ్‌ఆర్డర్ పోలీసులు దగ్గరుండి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. యూటర్న్, రోడ్డుపై ఇతర వాహనాలు ఆపకుండా వెంట వెంటనే పంపించి వేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తా, కుంట్లూర్ చౌరస్తాలో కూడా అప్పుడప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



హయత్‌నగర్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై నెమ్మదిగా కదులుతూ బారులుతీరిన వాహనాలు

మూసీలో పెరుగుతున్న వరద ఉధృతి

చాదర్‌ఘాట్: మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుంది. శనివారం మూసారాంబాగ్ కాజ్‌వే బ్రిడ్జిని అనుకుని వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీ వర్షాలతోపాటు హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీలోకి వరద నీటిని వదలడంతో వరద ప్రవాహం మరింత పెరిగింది. జిల్లా కలెక్టర్ హరిచందన్ చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జి పరివాహక ప్రాంతాన్ని హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణతో కలిసి పరిశీలించారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశముండడంతో ముందు జాగ్రత్త చర్యగా జీహెచ్‌ఎంసీ, హైడ్రా, రెవెన్యూ బృందాన్ని సిద్ధం చేసి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ